




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 213 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం శనివారం 13 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 213 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SAT 13 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur







## చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న

- మిగతా 2లో



## టాటాలను బెంగాల్‌కు తిరిగి తీసుకొస్తాం

**పెన్ పవర్ డెస్క్:** టాటా లను తిరిగి పశ్చిమబెంగాల్‌కు తీసుకువస్తామని సీఎం సువేందు అధికారి ప్రకటించారు. భూసేకరణపై నిరసనల కారణంగా 2008లో సింగూర్ నుంచి టాటా మోటార్స్ నానో ప్రాజెక్ట్ వైదొలగిన తర్వాత ఆ సంస్థ తిరిగి బెంగాల్‌కు రాలేదన్నారు. దాదాపు 17 ఏళ్ల అనంతరం బెంగాల్ పారిశ్రామిక పునరుద్ధరణలో భాగంగా

- మిగతా 2లో

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

## కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్



- రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు.

ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు.మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్

- మిగతా 2లో



## పాలకులం సేవకులం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

### రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు

- ఏపీలో రెండేళ్లు పూర్తి చేసుకున్న ఎన్డీఏ ప్రభుత్వం
- గత ప్రభుత్వం మిగిల్చిన సవాళ్లను అధిగమించామన్న సీఎం
- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించడమే లక్ష్యమని వెల్లడి
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారంతో రెండేళ్లు పూర్తయింది.

- మిగతా 2లో



## 'అఖండ' కాంగ్రెస్ దిశగా అడుగులు? ఆ పార్టీలు విలీనం కానున్నాయా?

- కాంగ్రెస్‌లోకి తిరిగి చేరే అంశంపై టీఎంసీ, ఎన్సీపీ-ఎస్పీ చుట్టూ చర్చ
- మమతా, శరద్ పవార్ విలీనానికి సిద్ధమంటూ నానా పటోలే వ్యాఖ్యలు
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతిపక్ష ఐక్యతకు కాంగ్రెస్ నేతల పిలుపు
- సోనియా, రాహుల్‌తో మమతా-అభిషేక్ భేటీల తర్వాత ఊహాగానాలు
- విలీన ప్రతిపాదన వస్తే టీఎంసీ నుంచే రావాలని కాంగ్రెస్ స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి వేదిక సిద్ధమవుతోందా? ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి విడిపోయి ప్రాంతీయ పార్టీలను స్థాపించిన నేతలు మళ్లీ అదే గూటికి చేరబోతున్నారా? ఈ ప్రశ్నలే ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభం, ఇటీవల జరిగిన వరుస రాజకీయ భేటీల నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఈ అంశంపై ఎన్‌డీటీవీ తాజాగా ఓ ఆసక్తికర కథనాన్ని ప్రచురించింది.

### విలీన ఊహాగానాలకు బలం

తృణమూల్ కాంగ్రెస్ తమ పార్టీలో విలీనం కానుందనే ప్రచారాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే ఖండించినప్పటికీ మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత నానా పటోలే చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ భావజాలానికి దగ్గరగా ఉన్న పార్టీలు మళ్లీ ఒక్కటయ్యే దిశగా ఆలోచిస్తున్నాయని, శరద్ పవార్, మమతా బెనర్జీ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం

- మిగతా 2లో

## క్రికెట్ ఆడిన మల్లారెడ్డి.. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో పాఠశాలల ప్రారంభోత్సవం

- మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో సీఎంఆర్, మల్లారెడ్డి పాఠశాలలను ప్రారంభించిన మల్లారెడ్డి
- మేడ్చల్ ప్రజలు తనను మూడు సార్లు గెలిపించారన్న మల్లారెడ్డి
- దీనికి కృతజ్ఞతగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పాఠశాలలు ఏర్పాటు చేస్తామని వెల్లడి

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# వదలని ఉక్కపోత

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భిన్న మైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీవ్రమైన ఎండలతో పాటు వానలు కూడా కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించినప్పటికీ ఇంకా రాష్ట్రమంతటా విస్తరించలేదు. కొంత మందగమనంతో నైరుతి పవనాలు నడుస్తున్నాయి. దీంతో ఉక్కపోత వాతావరణంతో పాటు ఎండ వేడిమి కూడా ఉంటుంది. పగటి పూట గరిష్టంగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే సాయంత్రానికి పలు చోట్ల చెదురుమదురు వానలు పడుతున్నాయి. మరో వారం పది రోజుల పాటు ఇలాంటి వాతావరణం ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఏపీలో గరిష్టంగానే ఉష్ణోగ్రతలు...

ఆంధ్రప్రదేశ్ లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే అక్కడక్కడా వానలు పడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో చురుగ్గా నైరుతి రుతుపవనాలు కదులుతున్నాయని చెబుతున్నప్పటికీ వానలు అనుకున్న స్థాయిలో పడటం లేదు. కొన్ని జిల్లాల్లో మాత్రమే పడుతుంది. ఈరోజు ఈదురుగాలులతో చెదురుమదురుగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశంఉందని చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

### తెలంగాణలో రుతుపవనాలు...

తెలంగాణలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి మూడు రోజులవుతుంది. అయితే అవి నెమ్మదిగా సాగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. గద్వాల్ జిల్లాలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వానలు పడ్డాయి. మరో ఐదు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అప్పుడు ఉత్తర తెలంగాణలోనూ వానలు పడతాయని చెప్పారు. అలాగే ఈసారి ఎలినినో ప్రభావంతో కొంత వర్షపాతం గత ఏడాదితో పోలిస్తే పదిశాతం తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న కాలంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని అంటున్నారు.

## పాలకులం సేవకులం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, గత వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లిన సవాళ్లు, సంక్షోభాలను అధిగమించి, ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చంద్రబాబు తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఐదు కోట్ల ప్రజల అపారమైన నమ్మకంతో ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయింది. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, అపరిష్కృత సమస్యల వారసత్వాన్ని మిగిల్చి వెళ్లగా, వాటన్నింటినీ అధిగమించి మేము ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు.

పాలనపై తమ ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ.. "అధికారం ఒక బాధ్యత అని, పాలకులు ప్రజలకు సేవకులని మా ప్రగాఢ నమ్మకం. ప్రతి పౌరుడు, ప్రతి కుటుంబం, సమాజంలోని ప్రతి వర్గం విజయం, శ్రేయస్సే మా ఎజెండా. వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.ఈ రెండేళ్ల ప్రయాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "రాష్ట్ర అభివృద్ధికి ప్రతి అడుగులో అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరపున నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో 'స్వర్ణాంధ్ర' దిశగా పయనిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. తమకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.పునరుద్ధరించబడిన ఆశావాదం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా 'ఎక్స్'లో స్పందించారు. "రెండేళ్ల క్రితం, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక కొత్త ప్రారంభం కోసం ఎన్డీఏపై నమ్మకం ఉంచారు. మా ముందున్న సవాళ్లు చాలా పెద్దవి. రాష్ట్ర భవిష్యత్తుపై తిరిగి విశ్వాసం నింపడం అంత సులభమైన పని కాదు" అని ఆయన పేర్కొన్నారు."గడిచిన రెండేళ్లలో ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో బలమైన కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి వృద్ధి, అవకాశాలు, అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం జరిగింది. ఇంకా చేయాల్సింది చాలా ఉన్నప్పటికీ, ఈ రోజు మన ప్రజల్లో పునరుద్ధరించబడిన ఆశావాదం, రాష్ట్రం సరైన దిశలో పయనిస్తోందన్న విశ్వాసం మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ప్రజలు మాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు" అని రామ్మోహన్ నాయుడు తన పోస్టులో పేర్కొన్నారు.

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

- మొదటి పేజి తరువాయి

అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## టాటాలను బెంగాల్‌కు తిరిగి తీసుకొస్తాం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో పెద్దఎత్తున టాటా గ్రూప్ పెట్టుబడులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో బెంగాల్ పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో సింగూర్, నందిగ్రామ్ ఆందోళనలకు దారితీసిన తప్పులను పునరావృతం చేయకుండా పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

**టాటాలు బెంగాల్ నుంచి ఎందుకు వెళ్లిపోయారంటే..?**

2006లో పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లా సింగూర్‌లో టాటా మోటార్స్ 'నానో' కార్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటుచేయడానికి అప్పటి వామపక్ష ప్రభుత్వం దాదాపు వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. అయితే, బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఉద్యమం జరిగింది. తీవ్ర నిరసనల కారణంగా 2008 అక్టోబరులో టాటా గ్రూప్ ఆ ప్రాజెక్ట్‌ను బెంగాల్ నుంచి గుజరాత్‌కు తరలించింది. 2016లో దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ భూసేకరణను రద్దు చేసి, రైతులకు భూములను అప్పగించాలని చారిత్రక తీర్పునిచ్చింది.

# బాదంపప్పు బాగోతాలు ఎపిసోడ్- 17

- ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లిన బాదం పప్పు కథ ఏమిటి?
- ప్రతి వి.ఆర్ వెనుక ఒకే తరహా వివాదాలున్నాయా?
- బాదంపప్పు వెనుక ఉండి కథ నడిపిస్తున్న ఆ 'జీ' ఎవరు?
- బాదం పప్పు బినామీ పండు ఎవరు?
- ఆకివీడు -- తాడేపల్లిగూడెం -- పెంటపాడు లింక్ ఏమిటి?
- సునీల్ మళ్ళీ తాడేపల్లిగూడెం రావడానికి విశ్వ ప్రయత్నాలు
- బాదంపప్పు వెనుక ఉండి వ్యవహారాలు నడిపిస్తున్న 'జీ' ఎవరు?
- రత్నం తెచ్చిన ఫైళ్లలో దాగి ఉన్న వివరాలేమిటి?
- లీగల్ అప్రోచ్ తో నిజాలు ఆగిపోతాయా?
- లంచాలు తీసుకోవాలంటే తాడేపల్లిగూడెం రావాల్సిందేనా..!
- అందుకు ఆ నియోజకవర్గ నాయకుడి అండదండలు ఉన్నాయా...?

**ఒక పోలీసు అధికారి ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లడం ఒక విశేషమైతే, ప్రతిసారీ కీలక పోస్టింగ్‌లతో తిరిగి రావడం ఇప్పుడు శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. వి.ఆర్‌లు, బదిలీలు, ప్రభావవంతమైన వ్యక్తుల ఆశీస్సులు, రాజకీయ అండదండల మధ్య నడుస్తున్న కథ వెనుక అసలు నిజాలు ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.**
**సునీల్ ఆకివీడు నుంచి తాడేపల్లిగూడెం, పెంటపాడు వరకు సాగిన పరిణామాలు, రత్నం తెచ్చిన ఫైళ్లు, మళ్లీ తాడేపల్లిగూడెం చేరేందుకు జరుగుతున్న ప్రయత్నాలు, లీగల్ హెచ్చరికలు, స్థానిక రాజకీయ సమీకరణాలు--- ఇవన్నీ ఇప్పుడు 'బాదంపప్పు బాగోతాలు'లో కొత్త కోణాలను వెలుగులోకి తెస్తున్నాయి.**

**ఇన్వెస్టిగేషన్ డెస్క్, పెన్ పవర్ తాడేపల్లిగూడెం జూన్ 12:** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొంతకాలంగా చర్చనీయాంశంగా మారిన ఒక పోలీసు అధికారి వ్యవహారం ఇప్పుడు మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది. సాధారణంగా ఒకసారి లేదా రెండుసార్లు వి.ఆర్‌లోకి వెళ్లడం పరిపాలనా వ్యవహారాల్లో కనిపించే అంశమే. కానీ ఒకే అధికారి ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతుండగా, ప్రతి సారి కీలక పోస్టింగ్‌లతో తిరిగి రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. శాఖ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ప్రతి వి.ఆర్ వెనుక వేర్వేరు కారణాలు ఉన్నప్పటికీ ఫలితం మాత్రం ఒకటేనని అంటున్నారు. వేకెంట్ రిజర్వ్‌లోకి వెళ్లిన తర్వాత కొంతకాలానికే ప్రాధాన్య ప్రాంతాల్లో పోస్టింగ్‌లు దక్కడం వెనుక ఉన్న కారణాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**లీగల్ అప్రోచ్ తో నిజాలు ఆగిపోతాయా? :** తాజాగా వెలువడుతున్న కథనాల నేపథ్యంలో సంబంధిత అవినీతి అధికారులు, పెన్ పవర్ పై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది... ఆ ఆరోపణలు నిజమైతే పెన్ పవర్ కూడా లీగల్ గా కోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాం... వ్యవస్థలో లోపాలను, ఆధారాలతో సహా రాస్తున్న కథనాల్లో... జర్నలిజం లో ప్రాథమిక సూత్రం ప్రకారం, ప్రచురితమైన ప్రతి అంశం ఆధారాలు, పత్రాలు, బాధితుల వాంగ్మూలాలు, సంబంధిత శాఖల సమాచారం ఆధారంగానే ప్రచురించబడిందని పెన్ పవర్ వర్గాలు చెబుతున్నాయి. "కోర్టు వేదిక అయినా, విచారణ సంస్థల ముందు అయినా, ప్రజల ముందైనా వాస్తవాలను, ఆధారంతో సహా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాం" అని పెన్ పవర్ తెలుపుతుంది.

**ఇనాం భూముల ఆన్‌లైన్ రహస్యం..? :** ప్రస్తుతం ఎక్కువ చర్చకు దారి తీస్తున్న అంశం ఇనాం భూముల వ్యవహారం. ప్రభుత్వ ఉత్తర్వులు (జీ.ఓ.) పూర్తిస్థాయిలో అమల్లోకి రాకముందే కొన్ని భూములు ఆన్‌లైన్ రికార్డుల్లోకి ఎలా వచ్చాయన్నది ప్రశ్నగా మారింది. ఆ ప్రక్రియను ఎవరు నిర్వహించారు..? ఏ అధికారుల అనుమతులు తీసుకున్నారు..? సంబంధిత ఫైళ్లలో ఉన్న నోట్ ఫైళ్లు ఏమి చెబుతున్నాయి..? డిజిటల్ ఎంట్రీలకు బాధ్యత వహించిన వారు ఎవరు..? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందని భూస్వాములు, బాధితులు కోరుతున్నారు.

**రత్నం తెచ్చిన ఫైళ్ల వెనుక ఏముంది..? :** స్థానికంగా "రత్నం ఫైళు"గా చర్చకు వచ్చిన కొన్ని భూవ్యవహార పత్రాలు ఇప్పుడు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. వాటిలోని వివరాలు, భూముల హక్కుల మార్పులు, రికార్డుల సవరణలు, సంబంధిత అధికారుల పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఫైళ్లలోని ప్రతి అంశాన్ని స్వతంత్ర విచారణకు అప్పగిస్తే మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఆకివీడు – తాడేపల్లిగూడెం – పెంటపాడు లింక్ ఏమిటి? :** సునీల్ ఆకివీడు నుంచి తాడేపల్లిగూడెం, అక్కడి నుంచి పెంటపాడు వరకు సాగిన పరిణామాలు ఇప్పుడు ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. కొంతకాలంగా బయటకు వచ్చిన సమాచారంలో మళ్లీ తాడేపల్లిగూడెం చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం వినిపిస్తోంది. ఈ ప్రయత్నాల వెనుక ఎవరి మద్దతు ఉంది? ఏ వర్గాలు పనిచేస్తున్నాయి? అన్న అంశాలు ఆసక్తిని పెంచుతున్నాయి.

**స్టేషన్‌లో కీలక నిర్ణయాలపై మామ 'జీ' ప్రభావం ఉందేదా..? :** ఆ అధికారి బదిలీ జరిగితే.. ఇక స్టేషన్ లో వ్యవహారాల్లో వారి పాత్ర ఏమిటి..? బయటకు కనిపించని అంతర్గత సమీకరణాలు ఏమైనా ఉన్నాయా..? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికే పనిలో సంబంధిత వర్గాలు ఉన్నాయని విశ్వాసనీయ సమాచారం.. ఇదే సమయంలో బాదంపప్పు వెనుక ఉండి వ్యవహారాలను ప్రభావితం చేస్తున్నారని ప్రచారంలో ఉన్న మామ 'జీ' పాత్రపై కూడా అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కీలక నిర్ణయాల దగ్గర నుంచి పోస్టింగ్‌ల వరకు ఆయన ప్రభావం ఉందని అనే చర్చ కొనసాగుతోంది.

**నిజాలు బయటపడాల్సిందే :** ట్రాన్స్‌ఫర్లు, ఆరోపణలు, ప్రతిఆరోపణలు, లీగల్ నోటీసులు, ఫిర్యాదులు– ఇవన్నీ ఒకవైపు అయితే, బాధిత ప్రజలు మాత్రం ఒకటే ప్రశ్న అడుగుతున్నారు. "ఏం జరిగింది..? ఎవరు చేశారు..? చట్టం ఏమంటోంది..?" సమాధానాలు ఫైళ్లలో ఉన్నాయా..? కోర్టుల్లో బయటపడతాయా..? లేక విచారణ సంస్థల నివేదికల్లో వెలుగులోకి వస్తాయా..? అనేది వేచి చూడాల్సిందే..!

**బాదంపప్పు బాగోతాలు -- ఎపిసోడ్ 18లో**
**"వి.ఆర్‌ల వెనుక అసలు కథ ఏమిటి..? కీలక పోస్టింగ్‌లకు దారి తీసిన అదృశ్య శక్తులు ఎవరు..?"**
**"ఇనాం భూముల నుంచి ఆన్‌లైన్ రికార్డుల వరకు... ఫైళ్లలో దాగిన సంతకాలు ఎవరివి..?**

## క్రికెట్ ఆడిన మల్లారెడ్డి.. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో పాఠశాలల ప్రారంభోత్సవం

మేడ్చల్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మాజీ మంత్రి మల్లారెడ్డి సరికొత్త అడుగులు వేశారు. స్థానిక విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త విద్యా సంస్థలను ఆయన ప్రారంభించారు. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్, మల్లారెడ్డి పాఠశాల బ్రాంచ్‌లను మల్లారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సరదాగా గడిపారు. వారితో క్రికెట్ ఆడి, అక్కడి వాతావరణంలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ మల్లారెడ్డి చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది.అనంతరం జరిగిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ... తనను వరుసగా మూడుసార్లు గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. వారికి కృతజ్ఞతగా వారి పిల్లలకు అతి తక్కువ ఫీజులతోనే నాణ్యమైన కార్పొరేట్ విద్యా సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో

భాగంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక సీఎంఆర్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని పాఠశాలలను ప్రారంభిస్తామని, నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయడమే తమ ఆశయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు శ్రీదేవి, శిరీష, మున్సిపల్ చైర్మన్ జామూ రవి, మాజీ లైబ్రరీ చైర్మన్ భాస్కర్ యాదవ్, జగన్ రెడ్డి, దయానంద్ యాదవ్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలి

- మొదటి పేజి తరువాయి

ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించగా... పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించి రాష్ట్రం శాంతి, సుభిక్షాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడిన బుద్దా వెంకన్న... ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి మరింత పురోగతి అందించేలా చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.అలాగే గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవకతవకలను ప్రజలు గమనించారని,

అందుకే ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కూటమికి బలమైన మద్దతు అందించారని గుర్తుచేశారు. వరదలు వంటి ప్రకృతి విపత్తులను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. వయసు పెరిగినా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు.

## జగన్ పేరులో 'జీ' అంటే 'జెన్ జీ' కాదు.. గొడ్డలి.. విధ్వంసమే ఆయన ఎజెండా

- మొదటి పేజి తరువాయి

సంధించారు. జగన్ తెచ్చిన కంపెనీలు కేవలం ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్ వంటి మద్యం బ్రాండ్లు మాత్రమేనని ఆరోపించారు. "జగన్ పేరులో ఉన్న 'జీ' అంటే జెన్-జీ అనుకుంటున్నారు. కానీ, ఆ జీకి అసలు అర్థం 'గొడ్డలి'. విధ్వంసమే ఆయన ఎజెండా" అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తమది గూగుల్ అయితే వాళ్లది గొడ్డలని, తమది ఫైటర్ జెట్స్ అయితే వాళ్లది ఫ్యాక్షన్ అని, తమది కియా అయితే వాళ్లది కిడ్నాప్ అని పోల్చారు.

**రెండేళ్ల పాలనలో ప్రశాంతత**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని లోకేశ్ అన్నారు. గతంలో మాదిరిగా దాడులు, జేసీబీలతో కూల్చివేతలు, కబ్జాలు, హత్యలు, బెదిరింపులు లేవని చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే చంద్రగిరి గడ్డపై చెప్పాను. వెంకన్నతో పెట్టుకోవద్దు, మాడి మసైపోతావని జగన్‌ను హెచ్చరించాను. ఆయన వినకుండా స్వామితోనే పెట్టుకున్నారు, ఫలితం 2024లో చూశారు" అని గుర్తుచేశారు. వై నాట్ 175 అన్నవారికి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, సిద్ధం అన్నవారికి ప్రజలు యుద్ధం ప్రకటించారని అన్నారు.

**డీఎస్సీపై జగన్ విమర్శలు.. రాజ్యాంగంపై దాడి**

చిన్నప్పుడు పదో తరగతి పేపర్ లీక్ కేసులో దొరికినప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ ఉపాధ్యాయులపై కక్షగట్టారని లోకేశ్ ఆరోపించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన చరిత్ర జగన్‌దని విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 226 కేసులు వేశారని, అయినా 150 రోజుల్లో 16,347 పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ఇప్పుడు డీఎస్సీపై జగన్ చేస్తున్న ఆరోపణలు తనపైనో, ప్రభుత్వంపైనో కాదని, నేరుగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ప్రశ్నించడమేనని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. పెన్షన్‌ను రూ.2000 నుంచి ఒకేసారి రూ.4000కు పెంచామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, 16,347 డీఎస్సీ పోస్టులతో పాటు 6,000 కానిస్టేబుల్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని వివరించారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, 'దీపం-2' కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలతో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు.

**డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే ప్రపంచంలో భారత్‌కు గౌరవం పెరిగిందని లోకేశ్ అన్నారు. ఏపీలో ఉన్నది సాధారణ డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, ఇది 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' అని అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు, ఫైటర్ జెట్ ప్రాజెక్టు వంటివి సాకారమయ్యాయని తెలిపారు. త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అహంకారానికి పోకుండా, ఒకే కుటుంబంలా కలిసి పనిచేయాలని, ప్రజలకు చేసిన మంచి పనులను వివరించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

## ప్రజల తీర్పే చరిత్రను మార్చింది.. ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది

- మొదటి పేజి తరువాయి

సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు."రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది" అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## 'అఖండ' కాంగ్రెస్ దిశగా అడుగులు? ఆ పార్టీలు విలీనం కానున్నాయా?

- మొదటి పేజి తరువాయి

పొత్తు కాదని, విలీనం స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పడం మరింత ఆసక్తిని రేకెత్తించింది.

**కాంగ్రెస్ నేతల సంకేతాలు**

ఇటీవల శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా కాంగ్రెస్ నుంచి విడిపోయిన చిన్న పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో కలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో చేరి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలని సూచించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఆయా పార్టీలు అధికారికంగా సమర్థించలేదు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే మాత్రం "సమయం వచ్చినప్పుడు చూద్దాం" అని అన్నారు.

**భేటీలతో పెరిగిన ఆసక్తి**

ఈ ఊహాగానాలకు ప్రధాన కారణం ఇటీవల ఢిల్లీలో జరిగిన రాజకీయ భేటీలే. ఇండియా కూటమి సమావేశం సందర్భంగా మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు వరుసగా సోనియా, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ముఖ్యంగా అభిషేక్-రాహుల్ సమావేశం గంటన్నరపాటు సాగడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కాంగ్రెస్ వర్గాలు మాత్రం విలీనం అంశంపై తమ నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేవని, అలాంటి ప్రతిపాదన వస్తే అది తృణమూల్ కాంగ్రెస్ నుంచే రావాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. దీంతో విలీనం చర్చలు వాస్తవ రూపం దాలుస్తాయా? లేక రాజకీయ ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# 14న సిరిగిందలపాడు లో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,జూన్ 12:** ఈనెల 14న రంపచోడవరం శివారులోని సిరిగిందలపాడు లో గల రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల లో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులు ఆయాసం, దడ, బీపీ ,షుగర్, చెవి, ముక్కు, గొంతు ,ఎముకలు ,కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పాటు స్త్రీల వ్యాధులు, పిల్లల వ్యాధుల కు సంబంధించిన వైద్యనిపుణులు హాజరవుతారని స్వామీజీ తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యే రోగులు పాత రిపోర్టులు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# నిర్లక్ష్య పర్యవేక్షణలో వసంతవాడ సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రాలు




✷ బరువును తూకం వేసి నిద్రపుచ్చుతున్నారు.

**-రాజుపేట అంగన్‌వాడీ కేంద్రం ఏలూరు జూన్ 12 పెన్ పవర్ :** కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు దశల వారీగా అంగన్ వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్న విషయం తెలిసందే.బాలల ఆరోగ్యానికి భరోసా కల్పించేదుకు కేంద్రాలకు ప్రథమ చికిత్సా కిట్లను అందించారు.కానీ అంగన్ వాడీ కేంద్రాలలో ప్రథమ చికిత్సా కిట్‌లు వినియోగించడం లేదు.సెక్టార్ పరిధిలో ఏటా నిర్వహించే పోషణ్ పక్వాడా కార్యక్రమం పటిష్టంగా నిర్వహించడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.వయస్సుకు తగిన బరువు,ఎత్తు ఎదగని పిల్లలు రాజుపేట అంగన్ వాడీ కేంద్రంలో ఉన్నారు.అంగన్ వాడీ సిబ్బంది,వారిలో ఎదుగుదల లోపించడానికి కారణాలను గుర్తించి,వారికి తగిన పోషకాహారం అందించే న్యూట్రిషన్ రిహేబిలిటేషన్ సెంటర్‌కు పంపకుండా, అంగన్ వాడీ కేంద్రంలోనే ఆలనా పాలనా,విద్యాభ్యాసం లేకుండా చిన్నారులను కేంద్రంలో నిద్ర పుచ్చి ఇళ్లకు పంపుతున్నారు.పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని వసంతవాడ సెక్టార్, సెంటర్ నెం 37లో సెంటర్ నిర్వాహకులకు అసలు న్యూట్రిషన్ రిహేబిలిటేషన్ సెంటర్ ఒకటి ఉందని అంగన్ వాడీ కేంద్రాల నిర్వాహకులకే తెలియలేదంటే అంగన్ వాడీ సూపర్‌వైజర్లు టీచర్లకు ఎంతగా అవగాహన కల్పిస్తున్నారో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులకే తెలియాలి.

**పర్యవేక్షణ ఎక్కడ..?**

గ్రామ పరిధిలోని ఆరోగ్య కార్యకర్త, ఎన్ఎం, తదితర ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల ఆరోగ్య సంరక్షణను పట్టించుకున్న ధాఖలాలు లేవు.పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించి, వయస్సుకు తగ్గ బరువు లేని పిల్లలను సెంటర్ పర్యవేక్షణ సిబ్బంది సెంటర్ రిజిష్టర్‌లో మాత్రమే చూస్తున్నారని,వెయిటేజీని స్వయంగా పరిశీలించపోవడంతో వయస్సుకు తగ్గ ఉండాల్సిన బరువులు రిజిర్లలో అంగన్ వాడీ టీచర్లు నమోదు చేస్తున్నారని పలు కేంద్రాలలో చిన్నారుల తల్లి తండ్రులు వ్యక్తం చేస్తున్నారు.పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పోషణ్ వాటికలలో పెంచిన కూరగాయలు,స్దానికంగా లభించే ఉత్పత్తులతో వంటల పోటీలు వంటి కార్యక్రమాలు,కేంద్రాల్లో నిర్వహించడం లేదు.

**సెంటర్ నిర్వహణ అధ్వాన్నం**

అంగన్ వాడీ కేంద్రంలో కిటికీల అద్దాలు పగిలిపోయాయి.వర్షం వస్తే వర్షపు జల్లులతో పిల్లల పాఠ్య పుస్తకాలకు భద్రత కరువైంది.పిల్లలకు పాఠ్యాంశాల భోదనకు ఉపకరించే బొమ్మలు,ఆటసామగ్రి ఉపయోగిస్తున్న జాడ లేదు.పాఠ్యాంశాలకు చెప్పేందుకు భోధించేకన్నా సెంటర్ నిర్వాహకురాలు యూనియన్ నేతలతో రాజకీయాలకు ప్రాధాన్యత సిస్తునట్లు ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి.అంగన్‌వాడీ నిర్వహణ పట్ల ప్రాజెక్టు అధికారుల ప్రశ్నిస్తే పలు కేంద్రాల సిబ్బంది యూనియన్ లీడర్ల పేరిట అధికారులకు సైతం ఎదురు తిరుగుతున్నట్లు సమాచారం.చిన్నారుల ఆలనా పాలన చూసుకోవాల్సిన చోట విదులు సక్రమంగా నిర్వహించకుండాసెంటర్ల నిర్వాహకులు రాజకీయాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం విషేశం

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏజెన్సీ డీఈవో




**విద్యార్థుల 100 శాతం హాజరుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి**

**గంగవరం, పెన్ పవర్, జూన్ 12:** పాఠశాలలకు విద్యార్థులు నూరు శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా నిర్వహిస్తున్న "బడి పిలుస్తోంది" కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లాలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గంగవరం మండలంలోని పాత రామవరం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలతో పాటు పెదగార్లపాడు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, బోధన విధానాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

పాఠశాలల్లో విద్యార్థులు నూరు శాతం హాజరు కావడం అభినందనీయమని డీఈవో పేర్కొన్నారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థుల సహకారం కారణమని కొనియాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యలో రాణించాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను ఆయన పంపిణీ చేశారు. విద్యా కిట్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేగేశ్వరపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 12:** వేగేశ్వరపురం గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్యర్యశీలో శుక్రవారం వేగేశ్వరపురంలో రాజమహేంద్రవరం అకిరా కంటి ఆసుపత్రి వారు కంటి పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపాటు కొమ్మిరెడ్డి నారాయణ, ఎంపీటీసీ లక్ష్మణరావు, నున్న కృష్ణ, కాళ్ళ సత్యనారాయణ, దూసనపూడి భగవాన్, అకిరా హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పీజీఆర్ఎస్ వేదికగా నిలిచింది





✷ కలెక్టర్ కీర్తి చేకూరి
✷ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు

**కొవ్వూరు, పెన్ పవర్, జూన్ 12:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని జిల్లాలో తొలిసారిగా కొవ్వూరు నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, స్థానిక స్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు.

శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నాలుగో, చివరి విడత ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, ఆర్డీవో కె.ఆనందరావు, వివిధ జిల్లా శాఖల అధికారులు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నాలుగు వారాల పాటు నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో మొత్తం 217 అర్జీలు స్వీకరించామని తెలిపారు. ప్రజల సమస్యలను శాఖల వారీగా వర్గీకరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. అందిన అర్జీలలో 35 అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయిని అనుసరించి పూర్తిస్థాయిలో పరిష్కరించగా, మిగిలిన అర్జీలను పరిశీలన నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ప్రాంతాల్లోనే సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం ఉపయోగపడిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని, సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సమస్యల స్వభావాన్ని బట్టి శాఖల మధ్య సమన్వయం పెంచి వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాలుగో విడత ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో మొత్తం 70 మంది ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. రెవెన్యూ, పింఛన్లు, గృహాలు, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై ఎక్కువగా అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ఆనందరావు, వివిధ జిల్లా శాఖల అధికారులు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి గోకులం షెడ్లు దోహదం

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244

✷ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్

**గంగవరం, పెన్ పవర్, జూన్ 12:** గిరిజన ప్రాంతాల్లోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా గోకులం షెడ్లను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ తెలిపారు. శుక్రవారం గంగవరం మండలంలోని కుసుమరాయి గ్రామంలో ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.ముందుగా కుసుమరాయి గ్రామంలోని గోకులం షెడ్లను సందర్శించిన ముఖ్య కార్యదర్శి పాడి గేదెల పెంపకం, పాల ఉత్పత్తి, రైతుల ఆదాయంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైఫ్ నిధులతో ఒక్కో గోకులం షెడ్‌ను రూ.22 లక్షల వ్యయంతో నిర్మించామని, ఒక్కో షెడ్‌లో 20 పాడి గేదెలు ఉండే విధంగా మొత్తం 18 షెడ్లను రూ.3.96 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గిరిజన మహిళలు పాడి పరిశ్రమలో స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.పాడి గేదెల మేత కోసం ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన సదుపాయాలు కల్పించుకోవచ్చని సూచించారు. గోకులం షెడ్లలో పనిచేస్తున్న మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పశువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించి, పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా గోకులం షెడ్లలో అవసరమైన సదుపాయాలపై మహిళా రైతులతో మాట్లాడిన ముఖ్య కార్యదర్శికి, బోరు మోటార్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులు వెంటనే నివేదికలు సిద్ధం చేసి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి సమర్పించాలని ఆదేశించారు.పోలవరం జిల్లాలోని గిరిజన మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. అలాగే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సహించాలని గిరిజన కుటుంబాలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డీఎన్‌వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, తహసీల్దార్లు తేజస్విని, సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, పశుసంవర్ధక వైద్యాధికారి గుడ్ల రిక్కిరాయి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

**మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు**




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 12:** విశాఖ ఉక్కు కర్మాగారం అంశంపై వైసీపీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనలు తెచ్చినప్పుడు వాటిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపలేదని ఆరోపించారు.విశాఖ ఉక్కు కర్మాగారానికి జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,600 కోట్లు అందించిందని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో కర్మాగారం రూ.486 కోట్ల నష్టాల్లో ఉండగా, ప్రస్తుతం రూ.54 కోట్ల లాభాల్లోకి వచ్చిందని తెలిపారు.ఇటీవల ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, ఈ ఘటనపై కూడా వైసీపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. బాధిత కుటుంబాలను జాతీయ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. అలాగే 90 రోజుల్లో బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారని తెలిపారు.అదేవిధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పలు నిధుల వినియోగంపై కూడా సీతంశెట్టి ప్రశ్నలు సంధించారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు, జల్ జీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చు చేయలేదని ఆరోపించారు.విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, వైసీపీ విమర్శలకు ప్రజలు విశ్వసనీయత ఇవ్వబోరని సీతంశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

## నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి నలుగురు వ్యక్తులపై 50వేలు భారీ జరిమానా



**సీతానగరం, పెన్ పవర్, 12:జూన్ :**నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు వివరాలు ఇలా తూర్పుగోదావరి జిల్లా మద్యం నిషేధ మరియు అబ్కారి డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఏనుగుల చైతన్య మురళి యొక్క ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ యం. వినయ్ బాబు మరియు జిల్లా మద్యం నిషేధం మరియు అబ్కారి అధికారి శ్రీలత సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని కోరుకొండ నిడదవోలు దేవరపల్లి ఎన్ఫోర్స్మెంట్ టాస్క్ ఫోర్స్ రాజమహేంద్రవరం దక్షిణ స్టేషన్ కొవ్వూరు రంగంపేట సబ్ ఇన్స్పెక్టర్లు మరియు సిబ్బందితో కోరుకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీతానగరం మండలంలోని శుక్రవారం నాడు ఆకస్మిక దాడుల నిర్వహించారు. ఈ దాడుల్లో బొబ్బిలంక ములకల్లంక కాటవరం ఇనగంటి వారి పేట రఘదేవపురం సీతానగరం అచ్చుయ్యపాలెం చీపురుపల్లి గ్రామాల్లో గోదావరి లంకల నాటు సారా స్థావరాలపై సంయుక్తంగా గాడు నిర్వహించి నాటు సారా అమ్మే ఇళ్లపై సోదాలు చేసి నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని 12 మంది ముద్దాయిలను తాసిల్దార్ ఎదుట హాజరుపరచగా అందులో నలుగురికి బైండ్ విధించారని కొరుకోండ సిఐ. శీను వాస్ బాలాజీ తెలిపారు.సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ నాటు సారా అమ్మిన రవాణా చేసిన తయారీదారులపై ఎప్పటికప్పుడు నిఘాఉంటుందని నాటు సారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## లక్కొండ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



**గంగవరం, జూన్ 12 (పెన్ పవర్):** గంగవరం ప్రాజెక్టు పరిధిలోని గంగవరం సెక్టార్ లక్కొండ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ వి. సుచరిత ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, గర్భిణీలు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తమ గర్భంలోని శిశువుతో మాట్లాడాలని, తల్లి స్వరాన్ని గుర్తించే సామర్థ్యం గర్భస్థ శిశువుకు ఉంటుందని తెలిపారు. పిల్లల ఎదుగుదలలో తొలి ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమైనవని పేర్కొంటూ, పుట్టినప్పుడు శిశువు మెదడు అభివృద్ధి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ రెండేళ్ల వయస్సు నాటికి అది 75 శాతం వరకు, ఆరేళ్ల వయస్సు నాటికి 90 శాతం వరకు అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ దశలో పిల్లలకు తగిన పోషకాహారం, ప్రేమాభిమానాలు, విద్యా వాతావరణం కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని సూచించారు.అంగన్వాడీ కేంద్రంలో ఆరు సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకుని ప్రాథమిక విద్య కోసం ఎంపీపీ పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమవుతున్న చిన్నారులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో నేర్చుకున్న పాటలు, పద్యాలు, విద్యా నైపుణ్యాలను చిన్నారులు తల్లిదండ్రులు, గ్రామస్తుల సమక్షంలో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాల సేవలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చిన్నారుల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకను పండుగ వాతావరణంలో నిర్వహించగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె. కుమారి, ఎంకేఎస్ ఎం. పాపయమ్మ, అంగన్వాడీ సిబ్బంది పి. రమణమ్మ, పి. లక్ష్మీదేవి, ఎం. పార్వతి, పి. వీరమణి, ఎస్. రాణి, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



**ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్ ,జూన్ 12** : ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని ఆమె క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సమస్యలపై ప్రజలు చేసిన వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.లోతట్టు గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే, వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కొన్ని సమస్యలు తక్షణ పరిష్కారానికి సంబంధించినవిగా ఉండగా, మరికొన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన కిలాడి నూకరాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షుడు ముప్పన కేశవ్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు వానపల్లి చిట్టిబాబు, గొర్లి సీతాంబరం, తేజ, బన్ను, ఊట చిన్నబాబు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లోకుల యాదగిరీశ్వరరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం...





**అడ్డతీగల, పెన్ పవర్,జూన్ 12**: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. మహేష్ రెడ్డి మాట్లాడుతూ,ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు, ప్రసవ సమయాల్లో, మరియు ప్రమాదాలకు గురైన రోగులకు అత్యవసర చికిత్స నిమిత్తం రక్తం సకాలంలో అందడం ప్రాణాధారమని పేర్కొన్నారు. ఈ బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉంటాయని, రక్తదానం చేసేవారు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు రక్తదానం చేయవచ్చని ఆయన తెలిపారు. యువత, సామాజిక శ్రేయోభిలాషులు తమ పుట్టినరోజులు లేదా ఇతర శుభకార్యాల సందర్భాల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఒక 300 ఎం ఎల్ రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలు కావాలని డాక్టర్ మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు.

?కౌన్సిలర్ నారే. వాసు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత ఇటువంటి సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, నిరంతరం ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

?ఈ శిబిరంలో స్థానిక యువకులు, స్వచ్ఛంద సేవకులు, మరియు ఆసుపత్రి సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

?సేకరించిన రక్త నిల్వలను సురక్షితంగా రంపచోడవరం బ్లడ్ బ్యాంక్‌కు తరలించారు.

?రక్తదాతలందరికీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ రేష్మ సుల్తానా, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కె. శేఖర్, ఎస్. పండు, కె. అరుణ, ల్యాబ్ టెక్నీషియన్లు, హాస్పిటల్ స్టాఫ్ నీలిమ, ఊహ, మరియు నర్సింగ్ సిబ్బంది,డి. సత్తిబాబు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఐ

## జీవో నెం.3పై ప్రభుత్వం మౌనం వీడాలి

**ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు**



**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్ జూన్ 12 :** గిరిజన ప్రాంతాల్లో వంద శాతం గిరిజన రిజర్వేషన్ల పునరుద్ధరణకు సంబంధించిన జీవో నెం.3 అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజవొమ్మంగిలో మేలిన రమేష్ అధ్యక్షతన నిర్వహించిన గిరిజన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రచురించిన ప్రకటనల్లో ఉద్యోగాల కల్పన, ఆర్థికాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్నప్పటికీ, గిరిజన యువత భవిష్యత్తుకు కీలకమైన జీవో నెం.3 పునరుద్ధరణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు, పోలీసు నియామకాలు చేపడుతున్నప్పటికీ జీవో నెం.3 అమలు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన గిరిజన అభ్యర్థులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. గిరిజనుల ఉద్యోగ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై గణాంకాలు వెల్లడిస్తున్నప్పటికీ, ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకున్న ప్రత్యేక చర్యలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, ఉపాధి అవకాశాల కల్పనలో ఇంకా అనేక సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.జీవో నెం.3 కేవలం పరిపాలనా ఉత్తర్వు మాత్రమే కాదని, ఏజెన్సీ ప్రాంత గిరిజనుల హక్కుల రక్షణకు సంబంధించిన కీలక అంశమని లోతా రామారావు అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ విషయంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యేక చట్టం ద్వారా గిరిజనుల ఉద్యోగ హక్కులను కాపాడాలని కోరారు.జీవో నెం.3పై స్పష్టత వచ్చే వరకు గిరిజన యువత, మేధావులు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైతే ఏజెన్సీ బంద్‌తో పాటు మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు మేలిన రమేష్, మనుగుల రాజు, మండల నాయకులు మేలిన మురళి, లోతా శ్రీను, పోలిశెట్టి లోవరాజు, ఎం. వినోద్, ఎం. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన నీరు..ఇదీ అధికారుల తీరు



**ఏలూరు జూన్ 12 పెన్‌పవర్ :** పెదపాడు మండలం కొత్తూరు పంచాయితీ పరిధిలో పలు వీధులలోకి ప్రవేశించే సిసి రోడ్ల నుండి ప్రధాన రహదారి వెంబడి డ్రైయినేజి కాలువలు లేక వర్షవస్తే పలు వీధులలో ప్రజలు అవస్థలకు గురువుతున్నారు.అయిదేళ్లపాడు గత ప్రభుత్వం కాలువల నిర్మాణానికి విస్మరించిరది.వీధులలో డ్రైనేజీ సౌకర్యం లేక, మరో వైపునకు నీరు ప్రవహించే మార్గం లేక ఎక్కడికక్కడ రోజుల తరబడి నిలిచిపోతున్నాయి.కొత్తూరు వినాయక వీధి ప్రవేశ మార్గం వద్ద,పలు వీధులలోని నివాసితులు ఇళ్లనుండి బయటకు వెళ్ల డానికి గోడ అంచులను పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని పలు వీధులలో నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి నిలిచిపోతున్న వర్షపునీటికి దారిమళ్లే విధంగా ప్రధాన రహదారి వెంబడి డ్రైన్ నిర్మించాలని, గ్రామ పంచాయితీ,మండల పరిషత్ అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సీతానగరం ఎస్సై గా ఎల్ . శ్రీను బాధ్యతలు



**సీతానగరం, పెన్ పవర్, :12జూన్ :**సీతానగరం ఎస్సైగా ఎల్. శ్రీను శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనపర్తి నుంచి బదిలీపై వచ్చారు ఇప్పటివరకు సీతానగరం ఎస్సైగా పనిచేసిన బి.వినాయ్ ప్రతాప్ అనపర్తి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి పెడతామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి ఏమైనా సమస్యలు ఉంటే నిర్భయంగా పోలీస్ స్టేషన్ ను సందర్శించాలని ఆయన కోరారు.

# గగనంగా దారి..గమ్యం చేరేనా మరి!

- చిన్నపాటి వర్షానికే తటాకంగా మారిన రహదారి
- ప్రమాదాల బారిన ప్రయాణీకులు



**ఏలూరు జూన్ 12 పెన్‌పవర్ :** ఏలూరు నగరంలో చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో రహదారులు ముంపునకు గురవుతున్నాయి గురువారం కురిసిన వర్షానికి కొత్తూరు నుండి పెదపాడు వెళ్లే ఆర్ అండ్ బి రహదారి బూరాయిగూడెం కూడలి వద్ద గోతులు పడి తటాకాన్ని తలపిస్తోంది.కొత్తూరు నుండి పలుగ్రామాల మీదుగా పెదపాడు చేరుకునే ప్రధాన మార్గం కావడంతో వాహన దారులు, ప్రయాణీకులుతీవ్రఇబ్బందులుపడుతున్నారు వర్షపునీరు బయటకు వెళ్లేందుకు కాలువల్లేక పోవడంతో సమస్య క్లిష్టమైంది.వంగాయగూడెం కూడలి నుంచి పెదపాడు మీదుగా పెరికీడు వంతెన వరకు రోడ్ అభివృద్ధికి ఎన్‌డిబి నిధులు రూ.40లక్షల కేటాయించారు.ఆ తరువాత వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రహదారి నిర్మాణం జరిగింది.బూరాయిగూడెం కూడలి వద్ద 300 మీటర్ల మేర రహదారి చిద్రంగా తయూరయింది.రాత్రి వేళ కూడలి వద్ద గుంతలు గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.తాత్కాలిక మర్మత్తు చేపట్టినా ఫలితం లేకుండా పోతోంది.అధికారులు స్పందించి రహదారి పై పడ్డ గుంతను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని వాహనదారులు ప్రయాణీకులు కోరుతున్నారు.

# ఏజెన్సీలో మొదలైన బడి పండుగ ...




**అడ్డతీగల, పెన్ పవర్ ,జూన్ 12;**వేసవి సెలవు అనంతరం పాఠశాలలు పునః ప్రారంభించే పనిలో ప-డ్డారు అధికారులు, దీనిలో భాగంగా ప్రతి పాఠశాలలోనూ బడి పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర లో భాగంగా విద్యార్థులకు అన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు స్కూల్ రీఓపెనింగ్ మొదటి రోజే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్.ఎం.సి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు , ఉపాధ్యాయుల సమక్షంలో పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

పాఠశాలను ఆకర్షణీయంగా పండుగ వాతావరణం లాగా అలంకరించి, కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ వారికి స్వీట్స్, చాక్లెట్స్ ,బిస్కెట్స్ ,బహుమతులు ఇచ్చి పాత విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ యధావిదంగా కొనసాగించారు , అంతేకాకుండా ప్రత్యేకంగా స్వీట్, పొంగల్ ఇచ్చి విద్యార్థులను ఆనందింపజేశారు.

మోడల్ ప్రైమరీ స్కూల్ అడ్డతీగల మరియు జి.పి.ఎస్.ఎస్ ఆర్సి అడ్డతీగల పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు విజిట్ చేశారు. ప్రధానోపాధ్యాయులు సారపు.నాగన్న దొర , పి. సత్యనారాయణ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, చిన్నారావు, గంగా భవాని , సన్నారత్నం, సౌమ్య శ్రీ మరియు ఎస్.ఎం.సి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# శనేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి భక్తుని ఉదార విరాళం



**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 12:** దేవాలయాల అభివృద్ధిలో భక్తుల సహకారం ఎంత కీలకమో మరోసారి నిరూపిస్తూ ఈతకోట గ్రామానికి చెందిన కర్రి వెంకటరావు శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానానికి భూమిని విరాళంగా అందజేశారు.ఈతకోట గ్రామంలోని సర్వే నెం.414/4లో గల 5½ సెంట్ల మెరక భూమిని స్వామివారి పేరున రిజిస్ట్రేషన్ చేయించి దేవస్థానానికి అంకితం చేశారు.

రావులపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 10న జరిగిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం భూ పత్రాలను దేవస్థాన అధికారులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ భూదానం ఉపయోగపడుతుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు దాత సేవాభావాన్ని కొనియాడుతూ, ఆయన చేసిన దానం ఇతర భక్తులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి భక్తులు అందిస్తున్న సహకారం వల్ల దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, దేవస్థాన సిబ్బంది, ఎన్ ఎస్ టి వి అధినేత చిలకమర్తి శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

**అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ ఆదేశం**






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 12 :** రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. మల్లికార్జున నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో అభివృద్ధి పనులు, వైద్య సేవలు, వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఇంజినీరింగ్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సమీక్ష సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలన్నారు. గిరిజన రైతులు రబ్బర్ తోటలు, పామాయిల్ సాగు, ఉద్యానవన పంటల సాగుపై ఆసక్తి చూపేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రబ్బర్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని, ఇప్పటికే 15 రబ్బర్ స్మోక్ రూములు మంజూరు చేయగా మరో ఐదు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, తాగునీటి సదుపాయాలు, రన్నింగ్ వాటర్ వ్యవస్థలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు.పీఎం జన్మన్ పథకం కింద పీవీటీజీ కుటుంబాలకు మంజూరైన గృహాలను జూలై నెలాఖరు నాటికి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ భవనాలు, మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని చెప్పారు.వ్యవసాయ రంగంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీపై దృష్టి సారించాలని సూచించారు. పామాయిల్, రబ్బర్ తోటలలో అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.వైద్య సేవలపై సమీక్షిస్తూ గర్భిణీలు, బాలింతలు, బాలబాలికల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల ద్వారా ఐరన్ మాత్రలు, పాలు, గుడ్లు, పోషకాహారం నిరంతరం అందేలా చూడాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రతి గ్రామంలో విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు, మొబైల్ నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గిరిజనుల ఆదాయం పెరగడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన పంటల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళికల ప్రకారం పనులు పూర్తి చేసి అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి అధికారులు పర్యటించినప్పుడు పూర్తి సమాచారంతో సమీక్ష సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐటీడీఏ అధికారులు, ఇంజినీర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మా యాతన కనిపించదా..?





- కలిపి ఏడిపిస్తున్నారు..!!
- విలీన గ్రామాల ప్రజల ఆవేదన

**ఏలూరు జూన్ 12 పెన్‌పవర్ :**నగరంలో కలిస్తే పట్టణ స్థాయి మౌలిక వసతులు సమకూరుతాయని..ఎద్దడి లేకుండా తాగునీటి సరఫరా ఉంటుందని చెప్పి వైకాపా పాలకులు ఏలూరు చుట్టుపక్కల ఉన్న 7 పంచాయితీలను కార్పోరేషన్‌లో విలీనం చేశారు.తీరా చూస్తే ఐదేళ్ల పాలనలో పన్నుల భారం మోపడం తప్పా ఒరిగింది లేదు.ఏలూరు చుట్టు పక్కల ఉన్న ఏడు పంచాయితీలను విలీనం చేసుకుని కేంద్ర,రాష్ట్రల నుండి అధికంగా వచ్చిన ఆర్థిక సంఘం గ్రాంట్లను నగరపాలక సంస్థ పొందింది.తీరా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు మాత్రం చేపట్టలేదు.అమృత్ పథకం 2.0 తీసుకువచ్చి విలీన గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఆర్భాటం చేశారు.ఆ పథకం పనులకు అతీగతీ లేదు.

**విముఖత ఎందుకంటే**

నగర పాలకలో కలసి ఉండడంతో భవన నిర్మాణ అనుమతులకు పట్టణ ప్రణాళిక విభాగం యంత్రాంగం భారీగా లంచాలు ఆశిస్తోంది.కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నా రూ.వేలకు వేలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని,ఐదేళ్ల నుండి నరకం చూస్తున్నామని,కాలువల్లో మురుగు,డ్రైనేజీలపై పలుకలు పగిలి పోయి ప్రమాద కరంగా మారాయని,కలుషితమైన తాగునీరు తాగాల్సి వస్తోందని,ఇన్ని ఇబ్బందులు ఉన్నా డివిజన్ స్థాయి నాయకులు గానీ,నగరపాలక సంస్థ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని బూరాయి గూడెం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**పారిశుధ్యం అధ్వానం..తాగునీరు కలుషితం :**

వెంకటాపురం పంచాయితీ పరిధిలోని బూరాయిగూడెం గ్రామాన్ని ఏలూరు నగర పాలక సంస్థలో కలిపారు. బూరాయిగూడెంలో తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.డ్రైనేజీలపై పలకలు చిద్రమై పాదచారులు,వాహన చోదకులు, ప్రమాదాల బారిన పడుతున్నారు.గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారాలతో దర్శిన మిస్తోంది.నగర పాలక సంస్థ సారిశుధ్య విభాగం అధికారుల ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని దీంతో బూరాయి గూడెంలో పారిశుధ్యం తాండవం చేస్తోందని,మురుగు వాసన,డ్రైనేజీలు నుండి వెలువడే దుర్వాసనతో,దోమలతో కంటిమీద కునుకు లేకుండా రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



# కొబ్బరి, కోకో, జీడి పంటలలో విలువ ఆధారిత ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు






ఉపకులపతి డా.కె. ధనుంజయరావు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 12:** ఉద్యాన పంటల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్కెట్లోకి తీసుకురావడం ద్వారా రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచవచ్చని డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కె. ధనుంజయరావు పేర్కొన్నారు.

డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన "ప్రధాన ఉద్యాన పంటల ప్రాసెసింగ్ మరియు పంట అనంతర సాంకేతికతలు" అంశంపై, రాష్ట్రం లోని 23 కెవికె లకు చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు, హోమ్ సైన్స్ శాస్త్రవేత్తలకు హెచ్‌ఆర్‌డీ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, "విశ్వవిద్యాలయం తాటి, ఈత, మామిడి, కూరగాయలు తదితర ఉద్యాన పంటల ఆధారంగా అనేక ప్రాసెసింగ్, విలువ ఆధారిత సాంకేతికతలను అభివృద్ధి చేసిందన్నారు. వీటిని వాణిజ్యీకరించి రైతులు, యువ పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఉద్యాన ఉత్పత్తిని స్థానిక, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా వర్గీకరించి, ఆయా రంగాల్లో ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలని అధికారులకు సూచించారు. ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ఉద్యానరంగం రైతులకు మరింత లాభదాయకంగా మారుతుందన్నారు.


రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆహార ప్రాసెసింగ్ రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, ముఖ్యంగా కొబ్బరి, కోకో, జీడిమామిడి పంటల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు అపార అవకాశాలు కల్పిస్తున్నారని" ఉప కులపతి తెలిపారు. ఈ పంటల ఆధారంగా గ్రామీణ స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చన్నారు.

రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, మహిళా సంఘాలు, యువత మన రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని", ఉపకులపతి డా. కె. ధనుంజయరావు పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. సీహెచ్ .రూత్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డా. ఈ.కరుణశ్రీ ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమ సంధానకర్త గా వ్యవహరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వైస్ ఛాన్సలర్ డా కె.ధనుంజయరావు గారిని సన్మానించారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసిపి ర్యాలీలు : ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూన్ 12:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక వైసిపి నేతలు వెన్నుపోటు అంటూ తప్పుడు ప్రచారంతో ర్యాలీలు చేస్తున్నారని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో శుక్రవారం మీభూమి-మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అవినీతి, అక్రమాలను ప్రజలు ఎన్నటికీ మరచిపోరని అన్నారు. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పధంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లటమే లక్ష్యం గా తప్పుడు ర్యాలీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే ర్యాలీలు ఎందుకు చేస్తున్నారని వైసీపీ నేతలను ప్రజలు నిలదీయాలని కోరారు. వైసిపి హయాంలో దర్శిపర్రు, జువ్వలపాలెం గ్రామాల్లో పంటలను ఈ క్రాప్ నమోదు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి పూర్తి యాజమాన్య హక్కులతో రాజముద్రతో పాస్ పుస్తకాలను అందించామని తెలిపారు. ఐదేళ్లలో రోడ్ల గుంతలు కూడా పూడ్చ లేని అసమర్ధ పాలన చేసిన వైసిపి నేతలు ఇప్పుడు రోడ్లపై ధర్నాలు చేయటం సిగ్గుచేటని అన్నారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మంచి పాలనను ప్రజలు గుర్తించి ప్రోత్సాహించాలని అన్నారు. ఓటరు జాబితా సవరణ(సర్)కార్యక్రమంలో అన్ని పార్టీలవారు పాల్గొని వంద శాతం సమగ్రంగా జరిగే విధంగా బాధ్యత వహించాలని కోరారు. కుటుంబ సభ్యుల ఖచ్చితమైన సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యారావు, ఎమ్మార్వో సునీల్ కుమార్, ఎండిఓ ప్రసాద్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పుల్ల బాబి, ఎంపీపీ కట్టు బోయిన వెంకటలక్ష్మి, చాపల రమేష్, సర్పంచ్ కోలా శేషువేణి, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు పెద్దబాబు, వాడపల్లి సుబ్బరాజు, మద్దాల మణికుమార్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, సిద్ధ వీరన్న, బేతిన గిరిధర్, పసల కొండ, శనగన రాంబాబు గౌడ్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పాలూరి భూపాల్, కట్టు బోయిన కృష్ణ ప్రసాద్, పాలూరి గ
బోరయ్య,తోట నిరీక్షణ రావు, పాలూరి వెంకన్న, కూటమి నాయకులు పాల్గొన్నారు

# వైఎస్సార్ సీపీ శ్రేణుల వెన్నుపోటుకు రెండేళ్లు భారీ నిరసన ర్యాలీ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 12:** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో భారీ నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు "వెన్నుపోటుకు రెండేళ్లు భా రీ నిరసన ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్ మీదుగా జయలక్ష్మి థియేటర్, పోలీస్ ఐ ల్యాండ్ మీదుగా జరిగింది. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సూపర్ 6 సూపర్ సక్సెస్ అంటూ ఈ కూటమి ప్రభుత్వం ఆర్భాటాలు చేయడం హాస్యాస్పదమన్నారు. హంగు ఆర్భాటాలతో ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేలా, ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చే విధంగా వైఎస్సార్ సీపీ ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మీరు బాండ్ పేపర్లలో సంతకాలు చేసి మరీ ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు మా ఈ ఉద్యమం ఆగదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ప్రతిపక్షంగా వైయస్ఆర్సీపీ పనిచేస్తోందని, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై దాడులు కేసులు, మహిళలకు భద్రత కరువైనది, దివ్యాంగుల సంక్షేమం లేకపోవడం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన మరియు నిరుద్యోగ భృతి కల్పించకపోవడం, డీఎస్సీ నిర్వహణలో అస్తవ్యస్తం మరియు అనర్హులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించడం, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో చెల్లించకపోవడం, శాంతి భద్రత విషయంలో రెడ్ బుక్ పాలన అమలు చేయడం, పేదలకు ఇళ్ల స్థలాలను ఇంతవరకు మంజూరు చేయకపోవడం, కొత్త పెన్షన్లు ఇంత వరకు మంజూరు చేయకపోవడం వంటి అంశాలను ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఇంజనీరింగు శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, బిల్లులు అప్లోడ్ చేయండి-కలెక్టర్ వెట్రిసెల్వి





**ఏలూరు జూన్ 12 పెన్ పవర్** :ఇంజనీరింగు శాఖలు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలోగా పూర్తిచెయ్యాలని ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు నిర్దేశించిన అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు వెంటనే పూర్తిచెయ్యాలని, పనులలో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులుపై శాఖాపరమైన చర్యలు తప్పవనీ,ఇంజనీరింగు శాఖలు నిర్మాణ పనులు ప్రగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో ఇంజనీరింగు శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు, బిల్లులు అప్లోడ్ పనులు నిర్ణీత సమయం లోగా పూర్తిచెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజనీరింగు శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు ప్రగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతనసమీక్షసమావేశాన్ని నిర్వహించారు. శాఖలు వారీగా సమీక్షించి ప్రగతిలో వెనుకబడిన అధికారులుపై జిల్లా కలెక్టరు దిశానిర్దేశం చేశారు.ఐసిడిఎస్, నీటిపారుదల శాఖలు అధికారులు సరైన సమాచారంతో హాజరు కానందున ఆగ్రహం వ్యక్తం చేస్తూ,షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇంజనీరింగు శాఖలు నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభం అయ్యాయని ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు నిర్దేశించిన అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు పూర్తి చెయ్యాలని ఆదేశించారు. పనులలో ప్రగతి చూపించని, బిల్లులు అప్లోడ్ లో నిర్లక్ష్యం వహించే అధికారులుపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇంజనీరింగు పనులలో ప్రగతి చూపించని, బిల్లులు అప్లోడ్ లో నిర్లక్ష్యం వహించే అధికారులుపై చర్యలు తీసుకుంటామని అన్నారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు సంఖ్యకు తగిన విధంగా సురక్షిత త్రాగునీటి ఆర్ఓ ప్లాంట్లు, టాయిలెట్లు ఉండాలని, వాటికి నీటిసరఫరా సౌకర్యం ఉండాలన్నారు. జిల్లాలో ప్రాథమిక, అంగన్వాడి, ఉన్నత పాఠశాలలో ఆర్వోప్లాంట్లు ఏలా పని చేస్తున్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలించి, మంచినీటి పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే భవనాలకు మౌలిక సదుపాయాలు పరిశీలించి రిపేర్లు ఉంటే పూర్తి చెయ్యాలని, శిథిలావస్థకు చేరిన భవనాలు ఉంటే ముందుగానే గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. బాలికలు వసతి గృహాలు వద్ద భద్రత కొరకు దాతలను సంప్రదించి సీసీ కెమెరాలు ఏర్పాట్లు చెయ్యాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా ఆర్ అండ్ బి శాఖ యస్ఇ కె. విజయరత్నం,నీటిపారుదల శాఖ యస్ఇ సి.హెచ్. దేవప్రకాష్, గృహనిర్మాణ పిడి జి. సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్ష అభియాన్ అధికారి పంకజ్ కుమార్, ఐసిడిఎస్ పిడి పి.శారద, సాంఘిక సంక్షేమ శాఖ డిడి వై.విశ్వమోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు, డిఇలు,తదితరులు పాల్గొన్నారు.

# సుస్థిరమైన ప్రణాళికలే గ్రామాల అభివృద్ధికి పునాది




**- జెడ్పీ సీఈఓ పి.జగదాంబ**

**ఏలూరు 12 జూన్ పెన్ పవర్:** ఏలూరు స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు మండల పరిషత్ లు , జిల్లా పరిషత్ లు అభివృద్ధి చెందాలంటే సుస్థిరమైన ప్రణాళికలను తయారు చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.జగదాంబ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం, సోషల్ సర్వీస్ ట్రైనింగ్ కేంద్రాలలో 20 26 -27 సంవత్సరానికి సంబందించి గ్రామపంచాయతి అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి ) తయారీపై శిక్షకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంధర్భంగా సీఈవో జగదాంబ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి సమాజ శ్రేయస్సు కొరకు సమర్ధవంతంగా పనులు నిర్వహించుటకు సమగ్రమైన ప్రణాళికలు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కోరారు. సుస్థిరమైన ప్రజా ప్రణాళిక తయారు చేయుటకు క్షేత్రస్థాయిలో మంచి అవగాహన కల్పించ వలసిన భాద్యత స్థానిక సంస్థల అధికారులు, ప్రజా ప్రతినిధులు పై ఉందని ఆమె అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీలో మండలస్థాయి డివిజనల్ స్థాయి మరియు జిల్లా స్థాయి అధికారులందరూ భాగస్వాములుగా ఉండి నిర్దిష్ట కాలవ్యవధిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధనకు కృషి చేయాలని , ప్రజల సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా పౌర సేవలు మరియు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు దిశా నిర్దేశం చేస్తాయని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో మహిళలు బాలలు మరియు ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు ప్రాధాన్యత నివ్వాలని జగదాంబ కోరారు. జిల్లా పంచాయతీ అధికారి జి. వి.కె. మల్లిఖార్జున రావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ఎంతో దోహదపడతాయన్నారు. గ్రామ స్థాయిలో మహిళలకు జీవనోపాధులు కల్పిస్తూ అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలు ద్వారా అందరికి అవకాశము కల్పించుట ద్వారా జీవన ప్రమాణాలు మెరుగపడతాయన్నారు .

గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రజా ప్రణాళికా రచనలో అన్ని వర్గాల స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేయాలనీ ఇందుకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఏపీఎస్. ఆర్. ఐ. డి కన్సల్టెంట్ శ్రీనివాసరావు , జిల్లా ట్రైనింగ్ మేనేజర్ గుర్రాల ప్రసంగి రాజు, మాష్టర్ ట్రైనర్లు,జి. ఆర్. మనోజ్, జి. డి. శ్రీనివాసరావు,టి. రవిచంద్ర,కె. కె. విశ్వనాధ్,యస్. వెంకటేష్ ,ధర్మ గోవింద్, శిక్షణ తరగతులను నిర్వహించగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల అధికారులు , డీఎల్పీవోలు,ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిజటల్ అసిస్టెంట్లు టి.ఓ.టి శిక్షణ పొందారు.

# శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ట్రీ ట్రిమ్మింగ్ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం**

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 12**: ట్రీ ట్రిమ్మింగ్ పనుల నిర్వహణ నేపథ్యంలో శనివారం (జూన్ 13) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. 33/11 కేవీ గొల్లపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శీల ఫీడర్‌కు సంబంధించిన శలపాక, తణుకువాడ, శీల, మంజేరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.

అలాగే 33/11 కేవీ ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కోలంక ఫీడర్‌కు చెందిన కోలంక, పొలమూరిపాడు, చలివేంద్రపాడు గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఇదే సమయంలో 11 కేవీ ఇంజరం ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని ఆక్వా యూనిట్లు, పరిశ్రమలకు సంబంధించిన ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) పనులు చేపట్టనున్నందున ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగ దారులు ఈ అసౌకర్యాన్ని సహనంతో అర్థం చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ కోరారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్, కాకినాడ ఎలక్ట్రికల్ ఆపరేషన్ విభాగం ప్రకటన విడుదల చేసింది.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026పై అవగాహన సమావేశం

- **రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలు, బీఎల్ఏలతో సమీక్ష నిర్వహించిన ఆర్డీవో జీవీ వి సత్యనారాయణ**






**కొత్తపేట, జూన్ 12:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం అవగాహన, ఓరియంటేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీవో జీవీ వి సత్యనారాయణ, మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో), ఆర్ఐ, ఏఈఆర్ఓ సిబ్బంది, సూపర్వైజర్లు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలపై అధికారులు సవివరంగా వివరణ ఇచ్చారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్చడం, తొలగించడం, సవరణలు చేయడం, చిరునామా మార్పులు నమోదు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫామ్ 6, ఫామ్7, ఫామ్ 8 వివరిస్తూ డూప్లికేట్ ఓటర్ల గుర్తింపు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాల పరిశీలన, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బీఎల్ఓలకు సూచించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా ధృవీకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను సమావేశంలో వెల్లడించారు. ఓటరు జాబితా ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేందుకు పరస్పర సహకారం అందించాలని అధికారులు కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు ఉంటే సంబంధిత బీఎల్ఓలను లేదా రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎమ్మార్వో సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సిబ్బంది, మండల స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అక్షయ పాత్రలా మారిన టీటీడీ నిత్యాన్నదానం

**పెన్ పవర్ డెస్క్:**
తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమం అక్షయ పాత్రలా మారింది. అన్నప్రసాద సేవ 15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతోంది. రోజుకు దాదాపు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నారు. 2026 జనవరి నుంచి మే వరకు 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్ చేశారు. ఆధునీకరణతో విస్తరిస్తున్న అన్న ప్రసాద సేవలు నిర్వహిస్తున్నారు. అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయి.తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వచ్చే భక్తులకు టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిత్యం మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. నిత్యం దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని టీటీడీ ఉచితంగా అందిస్తోంది. తిరుమలలో 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. తిరుమలలో సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారు.. అదే వీకెండ్ అయితే 3 లక్షలకు మించి భక్తులు ఉంటారు.శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ భక్తుల విరాళాలతో నిర్వహిస్తున్నారు. టీటీడీ దగ్గర ప్రస్తుతం రూ.2,500 కోట్లకు పైగా ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధుల ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తోంది. శ్రీవారి సన్నిధిలో ఆకలితో వచ్చే ప్రతి భక్తునికి తృప్తికరమైన భోజనం అందించడం ద్వారా టీటీడీ అన్నప్రసాద సేవలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. టీటీడీ భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తోంది. 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. రోజుకు 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 4,375 కొబ్బరికాయలు, 209 కిలోల ధనియాలు వంటి ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు మూడు నెలలుగా చూస్తే.. రోజుకు దాదాపు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటివి టీటీడీ భక్తులకు అందిస్తోంది. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం అందిస్తున్నారు. ఇలా చూస్తే రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా 2026 జనవరి 1 నుంచి మే 31 వరకు మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినారు. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్‌లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో రోజుకు 82 వేల మందికి పైగా భోజనాలు అందిస్తున్నారు. శ్రీ అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కాంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల బయట ఏర్పాటు చేసిన కేంద్రాలు, పీఏసీ అన్నప్రసాద భవనాలతో పాటుగా ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు.టీటీడీ అన్నప్రసాదం నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగిస్తున్నారు. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది. కొత్తగా ప్రారంభించిన పీఏసీ-5 (వెంకటాద్రి నిలయం)లో సుమారు 1,500 మంది ఒకేసారి భోజనం చేసే సామర్థ్యంతో కొత్త డైనింగ్ హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయి. కిచెన్‌లో ఆధునిక వంట పరికరాల ఏర్పాటు, క్యూఆర్ కోడ్ ఆధారిత విరాళాల సేకరణ కియోస్క్‌ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు కూడా చేపట్టారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మూడేళ్ల వరకు బాదుడు ఉండదు.. మంత్రి గొట్టిపాటి రవి బంపర్ ఆఫర్

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వ హయాంలో 'ట్రూ అప్' చార్జీల పేరిట ప్రజలపై మోపిన అదనపు భారాన్ని తగ్గిస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'ట్రూ డౌన్' వరాలను ప్రకటించింది. గతంలో ఎప్పుడో వాడిన విద్యుత్‌కు, ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాలు పెంచిన అదనపు బిల్లులను కలిపి వసూలు చేసేవి. దీనిని బిల్లులో ట్రూ అప్ చార్జీలుగా చూపేవారు. ఇలా గత ప్రభుత్వంలో ఏకంగా 9 సార్లు ట్రూ అప్ చార్జీలను వసూలు చేసినట్లు ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇప్పుడు ఈ చార్జీలను వసూలు చేయకపోగా, 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవి తాజాగా ప్రకటించారు.గతంలో వినియోగదారులు చెల్లించిన అదనపు బిల్లులను గుర్తించి ఆ మొత్తాన్ని తగ్గిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం యూనిట్‌కు 13 పైసల చొప్పున చార్జీలు తగ్గాయని మంత్రి గొట్టిపాటి రవి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి గొట్టిపాటి శుక్రవారం ఒక సంచలన ప్రకటన చేశారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలను పెంచలేదని గుర్తుచేశారు. రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ చార్జీలను పెంచబోమని స్పష్టం చేశారు. ఎప్పుడో వాడిన కరెంట్‌కు అధిక బిల్లులు వసూలు చేసిన చరిత్ర వైసీపీదైతే.. ప్రజలు కట్టిన అదనపు సొమ్మును తిరిగి తగ్గిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదని ఆయన లాజిక్‌తో సహా వివరించారు. ఇదే నిజమైన సంక్షేమ పాలన అని మంత్రి పేర్కొన్నారు.

**విపక్షానికి గట్టి కౌంటర్**

కూటమి పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఒకవైపు వైసీపీ 'వెన్నుపోటుకు రెండేళ్లు' అంటూ ఆందోళనలు చేస్తుంటే.. అదే రోజు మంత్రి గొట్టిపాటి 'ట్రూ డౌన్' వివరాలను బయటపెట్టి విపక్షానికి గట్టి షాక్ ఇచ్చారని వ్యాఖ్యానిస్తున్నారు. ఐదేళ్లలో 9 సార్లు రేట్లు పెంచిన వారికీ, రెండేళ్లుగా రూపాయి పెంచకుండా పైగా బిల్లులు తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, ఏపీలో 'ట్రూ అప్' బాదుడు కాలం పోయి, 'ట్రూ డౌన్' ఊరట కాలం వచ్చిందని మంత్రి తన ప్రకటనలో వివరించారని అంటున్నారు.

# కూటమికి 'కాపు గర్జన' సంకేతాలు!

**విజయవాడ, జూన్ 12, పెన్ పవర్:** ఏపీలో కాపులు ఇప్పుడు తెరపైకి వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరిలో కాపుల మహా గర్జన జరిగింది. అయితే ఇది కూటమికి ఒక హెచ్చరిక లాంటిది. ప్రస్తుతం కాపులకు ఉన్న ఏకైక ఆప్షన్ కూడా కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో కాపులు లేరు. ఒకసారి కాపులు ఆ పార్టీని నమ్మారు. జగన్మోహన్ రెడ్డి కొత్తగా ఏం చేయకపోగా.. కాపులకు సంబంధించి వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ పర్యవసానాలే ఆ పార్టీకి కాపులు దూరమయ్యారు. అప్పుడే వారంతా పవన్ కళ్యాణ్ వైపు టర్న్ అయ్యారు. అలా కూటమి వైపు అడుగులు వేశారు. అయితే ఇప్పుడు కూటమి పాలన రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో కాపులు తమ సమస్యలను పరిష్కరించాలని.. తమకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమ బాట పడుతుండడం విశేషం.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో కాపుల ఆలోచన మారే పరిస్థితి లేదు. ఎందుకంటే కాపుల రిజర్వేషన్లు అమలు చేయలేను అంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. అంతకుముందు చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన ఐదు శాతం ఈ బి సి రిజర్వేషన్లను సైతం రద్దు చేశారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ ఆర్థికపరమైన రిజర్వేషన్లను ఐదు శాతం ఇచ్చారు అప్పట్లో చంద్రబాబు. కానీ నేరుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేపట్టారు. అయితే అది రాజకీయ ప్రేరేపిత ఉద్యమమని తదనంతర పరిణామాల్లో తెలుసుకున్నారు కాపులు. అదే ముద్రగడ రాజకీయ ప్రేరేపితంలో భాగంగానే చేశారని ఆయన వైసీపీలోకి వెళ్లిన తర్వాత అర్థం అయింది. అయితే ఇప్పుడు కాపులు ఆర్థికపరమైన రిజర్వేషన్లు ఇచ్చిన కొంతవరకు సంతృప్తి పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అది నెరవేర్చే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న కాపుల ఆందోళన కార్యక్రమాల్లో ఒక అర్థం ఉంది. దానిని అర్థం చేసుకునే పనిలో ఉంది కూటమి ప్రభుత్వం. గత మాదిరిగా ఈ బీసీ రిజర్వేషన్లు ఇస్తే మిగతా సామాజిక వర్గాలు వ్యతిరేకించే అవకాశం లేదు. అయితే గతసారి ఐదు శాతం ఇచ్చారు. ఈసారి మాత్రం 10% ఈ బీసీ రిజర్వేషన్లు ఇవ్వచ్చు. ఆపై నామినేటెడ్ పోస్టులతో పాటు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లో కాపులకు సింహభాగం ప్రయోజనాలు కల్పించవచ్చు. ఒకవైపు సామాజిక వర్గానికి ఆర్థికపరమైన పథకాలు కూడా అందించవచ్చు. సామాజిక వర్గ నేతలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచవచ్చు. మరి ఇంతకంటే ఏం చేయగలరు. అయితే వైసీపీలో ఉన్న కాపు నేతలు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లేవర్ ఉన్న నేతల ప్రకటనలకు భిన్నంగా.. కూటమిని అలెర్ట్ చేసేందుకే ఈ కాపు గర్జనలు అని స్పష్టమవుతోంది. అయితే దీనిని మేల్కొని కూటమి ప్రభుత్వం కాపుల అభిమానాన్ని చూరగుంటే వైసిపి చేసే ప్రయత్నాలు ఏవి ఫలించవు కూడా.

# కర్ణాటక నుంచి అనంత... వేలాది కోట్ల రూపాయిల పెట్టుబడి

**అనంతపురం, జూన్ 12, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు.

# అన్న లేని లోటు తీర్చిన పవన్ అన్న.. లోకేశ్ ఎమోషనల్ స్పీచ్, జగన్‌పై స్ట్రాంగ్ కౌంటర్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి వేదికగా శుక్రవారం "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహా కూటమి అగ్రనేతలు హాజరైన ఈ సభలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రసంగం సభలో ఊపు తెచ్చింది. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డిపై తనదైన శైలిలో ఘాటు విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో తనకున్న ఆత్మీయ బంధాన్ని పంచుకుని అందరినీ ఆకట్టుకున్నారు.



**పవన్ అన్న అంటూ పొగడ్తలు**

మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై తనకున్న గౌరవాన్ని, అభిమానాన్ని బహిరంగంగా చాటుకున్నారు. "నాకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గత ఎన్నికల ముందు నుంచి కూటమి విజయం కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం పవన్ కళ్యాణ్ పడిన తపనను లోకేశ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను కేవలం ఒక రాజకీయ భాగస్వామిగా కాకుండా, కుటుంబ సభ్యునిగా, ఒక అన్నగా భావిస్తానని చెప్పడం ద్వారా కూటమి నేతల మధ్య ఉన్న బలమైన అంతర్గత బంధాన్ని ఆయన మరోసారి చాటిచెప్పారని అంటున్నారు. లోకేశ్ ఈ వ్యాఖ్యలు చేస్తుండగా సభకు వచ్చిన కార్యకర్తల నుంచి ఈలలు, కేకలతో భారీ స్పందన లభించింది.

**జగన్‌పై పొలిటికల్ పంచ్‌లు**

కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల విజయాలను వివరిస్తూనే, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి లోకేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను వేధించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. "10వ తరగతి పేపర్ లీక్ చేసినప్పుడు టీచర్లు జగన్‌ను చితకబాదారు. ఆ కోపం మనసులో పెట్టుకునే ఆయనకు టీచర్స్ అంటే పడదు.. అందుకే గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర కాపలాగా నుంచోబెట్టాడు" అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు పూర్తి గౌరవం కల్పిస్తున్నామని, విద్యా వ్యవస్థను సంస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగడుతూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**కూటమి పాలన నిరంతరాయంగా సాగాలి:**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. ఏపీ భవిష్యత్తు మారాలంటే కూటమి ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగాలని లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రధాని మోదీ అండదండలతో ఆంధ్రప్రదేశ్ మళ్లీ గాడిన పడిందని, ఈ అభివృద్ధి ప్రస్థానం ఇలాగే ముందుకు సాగాలంటే కూటమికి ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. తిరుపతి వేదికగా జరిగిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం' సభ కూటమిలో తిరుగులేని ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని చెబుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య మరింత సమన్వయాన్ని, బలాన్ని పెంచేలా నేతలు ప్రసంగించారని వ్యాఖ్యానిస్తున్నారు.

# చిన్న దేశాలే సాధించాయి.. మనకెందుకు దక్కలేదు? భారత ఫుట్‌బాల్ కల నెరవేరేది ఎప్పుడు?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఫుట్‌బాల్ పండుగగా పేరొందిన ఫిఫా వరల్డ్‌కప్ సమయం వచ్చిందంటే చాలు ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగుతుంది. కోట్లాది మంది అభిమానులు తమ ఫేవరెట్ జట్ల విజయాల కోసం ఎదురుచూస్తుంటారు. సోషల్ మీడియా నుంచి వీధుల వరకు ఎక్కడ చూసినా ఫుట్‌బాల్ జ్వరమే కనిపిస్తుంది.అయితే 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన యువశక్తి, ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా మార్కెట్లలో ఒకటైన భారత్ మాత్రం ఇప్పటికీ ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి ఆవేదనకు గురిచేసే విషయమే.



**జనాభా భారీ.. ఫలితం శూన్యం!**

భారత్ ప్రస్తుతం ఫిఫా ర్యాంకింగ్స్‌లో 138వ స్థానంలో కొనసాగుతోంది. క్రికెట్‌లో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో ఉన్న మన దేశం, ఫుట్‌బాల్‌లో మాత్రం ఇంకా పునాది దశలోనే ఉందనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచ పటంలో చాలా చిన్న దేశాలు కూడా వరల్డ్‌కప్‌లో పాల్గొన్న చరిత్ర కలిగి ఉండగా భారత్ మాత్రం దీనిని ఇప్పటికీ ఒక కలగానే మిగిల్చుకుంది.

**చిన్న దేశాల సంచలనం.. భారత్ ఎందుకు వెనుకబడింది?**

మన దేశంలోని ఒక చిన్న జిల్లా అంత విస్తీర్ణం లేదా జనాభా కూడా లేని దేశాలు ప్రపంచ ఫుట్‌బాల్‌లో తమ ముద్ర వేశాయి. ఉదాహరణకు ఐస్లాండ్ కేవలం కొన్ని లక్షల జనాభా ఉన్నప్పటికీ 2018 ఫిఫా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ట్రినిడాడ్ అండ్ టొబాగో అత్యంత తక్కువ జనాభాతోనే వరల్డ్‌కప్ వేదికపై మెరిసింది. పరాగ్వే పలుమార్లు ప్రపంచకప్‌లో పాల్గొనడమే కాకుండా నాకౌట్ దశలకు కూడా చేరింది. కురాకావో, కేప్ వెర్డే ఈ చిన్న దేశాలు సైతం అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన చేస్తున్నాయి. ఈ దేశాల విజయాలను బట్టి చూస్తే ఒక దేశం ఫుట్‌బాల్‌లో గెలవడానికి 'జనాభా' ముఖ్యం కాదు.. అక్కడ ఉన్న 'క్రీడా వ్యవస్థే' అత్యంత కీలకమని స్పష్టమవుతోంది.

**భారత్ వెనుకబడటానికి ప్రధాన కారణాలు**

భారతదేశంలో ఫుట్‌బాల్ ఆట ఆశించిన స్థాయిలో ఎదగకపోవడానికి క్రీడా విశ్లేషకులు కొన్ని ముఖ్యమైన కారణాలను చెప్తున్నారు.. భారత్‌లో క్రీడ అంటేనే ముందుగా గుర్తొచ్చేది క్రికెట్. మీడియా దృష్టి, కార్పొరేట్ పెట్టుబడులు, స్పాన్సర్‌షిప్‌లు అభిమానుల ఆదరణ అంతా క్రికెట్‌కే దక్కుతోంది. దీంతో ఫుట్‌బాల్‌కు అందాల్సిన స్థాయి ప్రోత్సాహం, నిధులు లభించడం లేదు.

**మౌలిక సదుపాయాల కొరత**

గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు మన దేశంలో ఫుట్‌బాల్ మైదానాలు, అత్యాధునిక శిక్షణా కేంద్రాలు, అకాడమీలు తగినంతగా లేవు. ప్రతిభ ఉన్నా సరే సరైన సదుపాయాలు లేక ఎంతోమంది యువ క్రీడాకారులు మధ్యలోనే ఆటను వదిలేస్తున్నారు.

**గ్రాస్‌రూట్ వ్యవస్థ బలహీనత**

యూరప్, దక్షిణ అమెరికా దేశాల్లో 5–6 ఏళ్ల చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఫుట్‌బాల్ నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తారు. కానీ భారత్‌లో స్కూల్, కాలేజ్ స్థాయిలో సమగ్రమైన ఫుట్‌బాల్ నిర్మాణం ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదు.

**లీగ్ వ్యవస్థ పరిమిత ప్రభావం**

ఇండియన్ సూపర్ లీగ్ వంటి టోర్నీలు ప్రారంభమయ్యాక భారత్‌లో ఫుట్‌బాల్‌కు కొంత ఊపు వచ్చినప్పటికీ, అవి జాతీయ జట్టు స్థాయిలో పెద్దగా ఫలితాలు సాధించడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది.

**ఆశలు ఇంకా సజీవమే!**

గత కొన్నేళ్లుగా భారత ఫుట్‌బాల్ రంగాన్ని గమనిస్తే కొన్ని సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇది అభిమానుల్లో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. యువ ఆటగాళ్లు విదేశీ క్లబ్‌ల ట్రయల్స్‌కు వెళ్తుండటం... దేశవ్యాప్తంగా ప్రైవేట్ ఫుట్‌బాల్ అకాడమీల సంఖ్య పెరగడం... మహిళా ఫుట్‌బాల్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శన ఇస్తుండటం. భారత్‌లో ఫుట్‌బాల్ అభివృద్ధికి 'ఫిఫా' సైతం ప్రత్యేక ప్రాజెక్టులను ప్రోత్సహిస్తూ మద్దతుగా నిలవడం ముఖ్యం..

**2030 లేదా 2034 లక్ష్యంగా ముందుకు..**

ఫిఫా వరల్డ్‌కప్‌లో జట్ల సంఖ్యను 48కి పెంచడం భారత్‌కు ఒక సువర్ణ అవకాశంగా మారింది. దీనివల్ల ఆసియా ఖండం నుంచి మరికొన్ని ఎక్కువ జట్లకు అవకాశం దక్కుతుంది. సరైన ప్రణాళిక, దీర్ఘకాలిక పెట్టుబడులు, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభను వెలికితీసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే.. వచ్చే దశాబ్దంలో 2030 లేదా 2034 కల్లా భారత్ కూడా ప్రపంచకప్ వేదికపై గర్జించే అవకాశం ఉంది.

140 కోట్ల జనాభా ఉన్న దేశం వరల్డ్‌కప్‌కు అర్హత సాధించలేకపోవడం కేవలం సంఖ్యల వైఫల్యం కాదు. అది మన క్రీడా విధానాలు, మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక ప్రణాళికల లోపానికి అద్దం పడుతోంది. చిన్న చిన్న దేశాలు సాధించిన విజయాలే భారత్‌కు పెద్ద ప్రేరణ కావాలి. ప్రతిభకు సరైన అవకాశాలు, శిక్షణకు ప్రభుత్వ–కార్పొరేట్ మద్దతు లభిస్తే... భారత్ వరల్డ్‌కప్ ఆడటం 'ఎప్పుడో ఒక రోజు' అనే ఆశ నుంచి, 'త్వరలోనే' అనే నమ్మకంగా మారడం ఖాయం!

# ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్, కోహ్లీ కీలకం: ఇర్ఫాన్ పఠాన్

ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్, కోహ్లీ అనుభవం కీలకమన్న ఇర్ఫాన్ పఠాన్

దక్షిణాఫ్రికాలో రోహిత్ షార్ట్‌పిచ్ బంతులను సమర్థంగా ఎదుర్కోగలడని విశ్లేషణ

వన్డేల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో కోహ్లీకి సాటే లేదని అభిప్రాయం

వికెట్‌కీపర్‌గా కేఎల్ రాహుల్ తర్వాత ఇషాన్ కిషన్ బ్యాకప్ అని పేర్కొన్న పఠాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయావకాశాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయని మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డేకు ముందు మాట్లాడిన అతడు ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లు జట్టుకు అందించే స్థిరత్వం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం విలువైనవని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వంటి భారీ టోర్నీల్లో అనుభవజ్ఞుల పాత్ర ఎంత ముఖ్యమో భారత్ గతంలో పలుమార్లు చూసిందని గుర్తు చేశాడు. రోహిత్ శర్మ గురించి మాట్లాడిన పఠాన్, అతని షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే నైపుణ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాడు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై వేగం, బౌన్స్ ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో రోహిత్ వంటి బ్యాటర్ ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చెలాయించగలడని అన్నాడు. బాల్ లెంగ్త్‌ను ముందుగానే అంచనా వేసి ఆడే అతని సామర్థ్యం భారత జట్టుకు పెద్ద బలమని వివరించాడు.

విరాట్ కోహ్లీ విషయానికి వస్తే వన్డే క్రికెట్‌లో అతని స్థిరత్వానికి సాటే లేదని పఠాన్ పేర్కొన్నాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే కోహ్లీ తొలి వికెట్ త్వరగా పడినప్పుడు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగలడని చెప్పాడు. భారీ లక్ష్యాల ఛేదనలో కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని వివరించాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడే అతని స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపాడు. ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ దూకుడు, కోహ్లీ నిలకడ రెండూ భారత్‌కు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేశాడు. ఇక వికెట్‌కీపర్ బ్యాటర్ల ఎంపికపై కూడా పఠాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. వన్డేల్లో కేఎల్ రాహుల్ భారత జట్టు తొలి ఎంపిక వికెట్‌కీపర్ బ్యాటర్ అని చెప్పాడు. ఐదు, ఆరు స్థానాల్లో అతను జట్టుకు బ్యాలెన్స్‌ను అందించగలడని వివరించాడు. బ్యాకప్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని తెలిపాడు. ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం అతనికి ఉందని తెలిపాడు. అలాగే అవకాశం వచ్చిన ప్రతిసారీ సత్తా చాటిన సంజూ శాంసన్‌ను కూడా పరిశీలించొచ్చని సూచించాడు.

# 90 నిమిషాల ఆట.. వేల కోట్ల సంపాదన.. ఇది క్రిస్టియానో రొనాల్డో లెక్క!

**ఒక్క మ్యాచ్ ఆడితే రొనాల్డో సంపాదన సుమారు 30 కోట్లు**

**ఈ మొత్తం సంపాదించడానికి ఓ భారతీయ ఉద్యోగికి 2,500 ఏళ్లు**

**సౌదీ క్లబ్‌తో ఒప్పందం ద్వారా రొనాల్డో వార్షిక ఆదాయం 1,700 కోట్లకు పైమాటే**

**రొనాల్డో నికర ఆస్తి విలువ సుమారు 10,000 కోట్ల రూపాయలు**

**ఈ సంపదను అందుకోవాలంటే ఏడాదికి 12 లక్షల జీతంతో 83,000 ఏళ్లు పనిచేయాలి**



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఇక జీతం అనే మాట చిన్నదైపోయింది. అతను ఇప్పుడు సమయాన్ని శాసించే స్థాయిలో సంపాదిస్తున్నాడు. ఫుట్‌బాల్ మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ, కాలం అతని కోసం ప్రత్యేకంగా నడుస్తుంది. కేవలం 90 నిమిషాల ఆట అతనికి దాదాపు 30 కోట్ల రూపాయలు సంపాదించి పెడుతుంది. ఇదే మొత్తాన్ని ఏడాదికి 12 లక్షల రూపాయల జీతం తీసుకునే ఓ భారతీయ ఉద్యోగి సంపాదించాలంటే ఏకంగా 2,500 సంవత్సరాలు పడుతుంది. ఎన్డీటీవీలో వచ్చిన కథనం ప్రకారం.. ఈ లెక్కలు ఎలా సాధ్యమో వివరంగా చూద్దాం. ప్రస్తుతం 41 ఏళ్ల వయసులో ఉన్న రొనాల్డో, సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తో చేసుకున్న ఒప్పందం ద్వారా ఏడాదికి సుమారు 200 మిలియన్ డాలర్లు ఆర్జిస్తున్నాడు. భారత కరెన్సీలో ఇది సుమారు 1,700 కోట్ల రూపాయలతో సమానం. ఒక ఫుట్‌బాల్ సీజన్‌లో క్లబ్, జాతీయ జట్టు తరఫున రొనాల్డో సగటున 55 మ్యాచ్‌లు ఆడతాడని అంచనా. ఈ లెక్కన అతని వార్షిక ఆదాయాన్ని మ్యాచ్‌ల సంఖ్యతో భాగిస్తే, ప్రతి మ్యాచ్‌కు అతని సంపాదన దాదాపు 30 కోట్ల రూపాయలని తేలుతుంది. అంటే.. 90 నిమిషాల ఆట, అదనపు సమయం కలిపి అతనికి వచ్చే ఆదాయం, మన దేశంలోని ఎన్నో కంపెనీలు తమ ఉద్యోగులందరికీ ఏడాది జీతాల కోసం కేటాయించే బడ్జెట్‌తో సమానం. ఇది కేవలం అతని వార్షిక ఆదాయం మాత్రమే. ఇక అతని నికర ఆస్తి విలువ చూస్తే కళ్లు చెదరడం ఖాయం. ప్రస్తుతం రొనాల్డో ఆస్తి విలువ 1.2 బిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని అంచనా. మన కరెన్సీలో చెప్పాలంటే ఇది సుమారు 10,000 కోట్ల రూపాయలు. రెండు దశాబ్దాలకు పైగా అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆడటం, ఛాంపియన్స్ లీగ్ బోనస్‌లు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఇమేజ్ రైట్స్, సొంత వ్యాపారాలు, ప్రపంచంలోని ఎన్నో దేశాల జనాభా కంటే ఎక్కువ ఉన్న సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను ఆదాయంగా మార్చుకోవడం ద్వారా ఈ అపార సంపదను కూడబెట్టాడు. ఇప్పుడు ఈ 10,000 కోట్ల రూపాయల సంపదను, ఏడాదికి 12 లక్షలు

సంపాదించే భారతీయ ఉద్యోగితో పోల్చి చూద్దాం. రొనాల్డో ఆస్తిని అందుకోవాలంటే.. ఆ ఉద్యోగికి దాదాపు 83,333 సంవత్సరాలు పడుతుంది. మరోలా చెప్పాలంటే.. ఒక వ్యక్తి తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎంత సంపాదించినా అది రొనాల్డో సంపద ముందు సముద్రంలో నీటిబొట్టు లాంటిదే. దాదాపు 2,000కు పైగా ఉద్యోగ జీవితాలను పక్కపక్కన పెడితే గానీ ఆ సంపదను అందుకోలేరు. ఫుట్‌బాల్, గ్లామర్, ట్రోఫీలు, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్‌ను పక్కనపెట్టి కేవలం అంకెలను చూస్తే, అసలు కథ బోధపడుతుంది. ఆధునిక ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక వ్యక్తి 90 నిమిషాల సమయం, వేలాది మంది సంవత్సరాల తరబడి చేసే ఉద్యోగానికి సమానంగా నిలుస్తోంది. ఇదే క్రిస్టియానో రొనాల్డో సృష్టించిన ఆర్థిక అద్భుతం.



**రుహాని శర్మ: టాలీవుడ్ బహుముఖ నటి - ఆకర్షణీయమైన తేజస్సు**

# 'సింగ్ గీతం' మార్క్ మ్యాజిక్ ఇక ప్రేక్షకుల చేతుల్లోనే!



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ గ్లోబల్ స్థాయిలో దూసుకుపోతోంది. భారీ బడ్జెట్ చిత్రాలు, కమర్షియల్ హంగులతో కూడిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. మరోవైపు వైవిధ్యమైన కథాంశాలతో వచ్చే ప్రయోగాత్మక చిత్రాలకు కూడా అంతే స్థాయిలో ఆదరణ లభించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలోనే ఇండస్ట్రీ లో సరికొత్త చర్చకు తెర తీసింది -సింగ్ గీతం- అనే ఒక ఆసక్తికరమైన కాన్సెప్ట్. రొటీన్ మాస్ మసాలా ఫార్ములాకు భిన్నంగా.. సరికొత్త కథనంతో 94 ఏళ్ల దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరవు రూపొందించిన చిత్రమిది.

తెలుగు పరిశ్రమకు ప్రయోగం అనే మాటను పరిచయం చేసిన ఓ లెజెండ్ డైరెక్ట్ చేసిన చిత్రం కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇలాంటి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు మనస్ఫూర్తిగా ఆదరించాలని సినీ విశ్లేషకులు అంతే భావిస్తున్నారు. సాధారణంగా తెలుగు ప్రేక్షకులు సినిమాను కేవలం వినోద సాధనంగానే కాకుండా ఒక పండుగలా భావిస్తారు. అయితే పెద్ద స్టార్లు.. వారు క్రియేట్ చేసే హడావుడి నడుమ చిన్న సినిమాలు .. వినూత్నమైన టైటిల్స్, విభిన్నమైన కాన్సెప్టులతో వచ్చే చిత్రాలు ఒక్కోసారి సరైన గుర్తింపునకు నోచుకోలేకపోతున్నాయి.

కంటెంట్‌లో ఎంత దమ్మున్నా? స్టార్ పవర్ లేకపోవడం వల్ల చిత్రాలు థియేటర్లలో నిలదొక్కుకోవడం సవాలుగా మారుతోంది. అందుకే కమర్షియల్ ఇమేజ్ పక్కన పెట్టి కేవలం కథను నమ్మి వచ్చే ఇలాంటి సరికొత్త ప్రయత్నాలకు ప్రేక్షకుల మద్దతు ఎంతో అవసరం. -సింగ్ గీతం- వంటి చిత్రాల వెనుక ఎంతో మంది నూతన నటీనటులు, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల కష్టం దాగి ఉంటుంది. టాలీవుడ్‌లో కొత్త తరం మేకర్స్ సరిహద్దులను బ్రేక్ చేస్తూ వినూత్న ప్రమాణాలతో కూడిన కథలను టచ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇలాంటి ప్రయోగాలను తెలుగు ఆడియన్స్ మునుపెన్నడూ లేనంతగా ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది. సినిమా బాగుంటే భాషతో లేదా బడ్జెట్‌తో సంబంధం లేకుండా బ్రహ్మరథం పట్టే తెలుగు ఇండస్ట్రీ వైవిధ్యమైన చిత్రానికి కూడా అదే తరహా వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రేక్షకుల అభిరుచి చాలా వరకు మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్నమైన కంటెంట్‌ను ఓటీటీల లో వీక్షిస్తూ సినిమా పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. కానీ ఆ మార్పు కేవలం డిజిటల్ స్క్రీన్లకే పరిమితం కాకుండా థియేటర్ల వద్ద కూడా కనిపించాలి. -సింగ్ గీతం- వంటి సినిమాల్లో ఉండే ఫ్రెష్ థాట్స్, కొత్త తరహా మేకింగ్‌ను థియేటర్లలోనే ఎంజాయ్ చేసినప్పుడే, మేకర్స్‌కు మరింత ఉత్సాహం లభిస్తుంది. కేవలం పెద్ద సినిమాలకే థియేటర్లు అనే అపోహను వీడి ఇలాంటి కంటెంట్-ఓరియెంటెడ్ సినిమాలకు కూడా ఓపెనింగ్స్ అందించేలా తెలుగు ఆడియన్స్ అడుగులు వేయాలి. ఒక పరిశ్రమ ఆరోగ్యకరంగా ఎదగాలంటే అక్కడ కమర్షియల్ హిట్స్ ఎంత అవసరమో? సమాంతరంగా ప్యారలల్ సినిమా .. ప్రయోగాత్మక చిత్రాల విజయం కూడా అంతే ముఖ్యం.

-సింగ్ గీతం- చిత్రానికి లభించే ఆదరణ కేవలం ఆ ఒక్క సినిమా విజయానికే పరిమితం కాదు. భవిష్యత్తులో మరెంతో మంది యువ దర్శకులు సరికొత్త ఆలోచనలతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి ఓ ధైర్యాన్ని ఇస్తుంది. రిస్క్ అని తెలిసినా కొత్తదనాన్ని నమ్ముకుని సినిమా తీసే నిర్మాతలకు ఈ విధమైన ప్రోత్సాహం ఆర్థికంగా .. మానసికంగా ఎంతో భరోసానిస్తుంది.



**మేధా శంకర్ మిడ్‌నైట్ మ్యాజిక్ & రైజింగ్ బాలీవుడ్ స్టార్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965